క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం



పశువైద్యశాలలో ప్రమాదకరంగా ఉన్న పాడైన స్తంభం

సాలూరు రూరల్: మండలంలోని బాగువలస పశువైద్యశాల ముందు ఉన్న శ్లాబ్ ఒకే స్తంభంపై ఆధార పడి ఉంది. అయితే ఆ స్తంభం కింద పూర్తిగా విరిగి ప్రమాద భరితంగా ఉంది. అందులోనే పశువులకు వైద్యం అందిస్తున్నారు. పశువులతో పాటు పశువైద్యసిబ్బంది, రైతులు ఆ పాడైన స్తంభంపై ఆధారపడిఉన్న శ్లాబ్ కిందనే కొంత సమయం ఉంటున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పశువులు తీసుకొస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

లలితా త్రిపుర సుందరి దేవిగా దుర్గమ్మ



అజ్జాడలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరి దేవి అవతారంలో అలంకరించి పూజలు చేస్తున్న భక్తులు

బలిజిపేట: మండలంలోని అజ్జాడలో శ్రీ విజయదుర్గా భవాని ఆలయంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరి దేవి అవతారంలో అలంకరించి శనివారం పూజలు చేశారు. అర్చకుడు బి.రామ లింగస్వామి ఆధ్వర్యంలో మహిళలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

మాజీ పీసీ ఫాతిమాకు అభినందనలు



స్కూల్ అసిస్టెంట్ నియామక పత్రాన్ని అందిపుచ్చుకుంటున్న మాజీ పీసీ ఫాతిమా

సీతానగరం: మండల పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబల్‌గా పనిచేసిన ఫాతిమా స్కూల్ అసిస్టెంట్ పోస్టు సాధించడం పట్ల ఎస్సైతో పాటు సిబ్బంది ఆమెకు అభినందనలు తెలియజేశారు. ఫాతిమా సీతానగరం పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబల్‌గా పని చేసే సమయంలో స్కూల్‌అసిస్టెంట్ పోటీ పరీక్షల్లో పాల్గొన్నారు. ఇక్కడి నుంచి బదిలీ అయిన తరువాత విద్యాశాఖ ప్రకటించిన ఫలితాల్లో స్కూల్‌అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. ఫాతిమా ఉపాధ్యాయ వృత్తిలో విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దుతారన్న నమ్మకం తమకు ఉందని ఎస్సై ఎం.రాజేష్ అన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య లోపం



బాగువలసలో ప్రధాన రహదారి పక్కన పోగువేసిన చెత్తకుప్ప

సాలూరు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్య లోపం తాండవిస్తోంది. ముఖ్యంగా గ్రామాల్లో సేకరించిన చెత్తలు ఆదే గ్రామాల్లోని రహదారులకు ఇరువైపులా పోగులు వేస్తున్నారు. దీంతో గ్రామంలోకి వెళ్లే రహదారులు పారిశుధ్య లోపంతో కొట్టుమిట్టాడుతున్నాయి. గ్రామాల్లో సేకరించిన చెత్తలు గ్రామానికి దూరంగా వేయాల్సి ఉండగా అలా చేయక పోవడంతో ఏ గ్రామంలో చూసిన ఇదే పరిస్థితి కనిపిస్తోంది. బాగువలస గ్రామంలో ప్రధాన రహదారికి ఇరువైపులా చెత్తలు పేరుకుపోవడంతో అటుగా వెళ్లే వాహన దారులు, గ్రామప్రజలు చెత్తనుంచి వచ్చిన దుర్వాసన పీల్చుకుంటూ వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు.

కంటి అద్దాల పంపిణీ



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ పి. ఉషారాణి.

సీతానగరం: అంధత్వ నివారణకు శంకర్ నేత్రాలయ ఫౌండేషన్, హిందుస్థాన్ షిప్‌యార్డ్ యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమని పీహెచ్‌సీ డాక్టర్ పి.ఉషారాణి అన్నారు. ఈ మేరకు స్థానిక పీహెచ్‌సీలో శంకర్‌ఫౌండేషన్, హిందుస్థాన్ షిప్‌యార్డ్ యాజమాన్యాలు సంయుక్తంగా 54 మందికి అంధత్వనివారణకు శనివారం కంటి పరీక్షలు చేసి శస్త్ర చికిత్స అవసరం లేదని 17 మందిని గుర్తించాయి. ఈ మేరకు నేత్ర ఉచితవైద్యశిబిరం ఏరియా మేనేజర్ వెంకటరమణ ఆధ్వర్యంలో డాక్టర్ ఉషారాణి కంటి అద్దాలను 17 మందికి పంపిణీ చేశారు.

ప్రభుత్వజాగా.. దర్జాగా కబ్జా..!

- స్థలాలు ఆక్రమించి దుకాణాల ఏర్పాటు
- అద్దెకు ఇస్తున్న ఆక్రమణదారులు
- పరిశీలించిన తహసీల్దార్





మక్కువ జగనన్న కాలనీవద్ద ప్రభుత్వస్థలాల్లో వెలిసిన దుకాణాలు, (ఇన్‌సెట్లో) విద్యుత్ కనెక్షన్‌తో ఏర్పాటైన ఓ దుకాణం

మక్కువ: మండలకేంద్రం మక్కువ, చెముడు గ్రామాల మధ్య రహదారి పక్కన జగనన్న కాలనీ ఏర్పాటుచేసి, పక్కా ఇళ్లు గత ప్రభుత్వం నిర్మించింది. ఇదే అదునుగా కొంతమంది వ్యక్తులు కాలనీ సమీపంలో రహదారిని ఆనుకుని, పెద్ద,పెద్ద దుకాణాలు ఏర్పాటుచేసి, దసరా పండగకు ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్నారు. అంతేకాకుండా ఏకంగా ఆ దుకాణాలకు విద్యుత్ కనెక్షన్‌లు కూడా పొందడం విశేషం. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రం మక్కువ సమీపంలో జగనన్న కాలనీని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో నిర్మించారు. సుమారు 350 గృహాలు కాలనీలో ఉన్నాయి. కాలనీని ఆనుకుని ఉన్న రహదారి పక్కన ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా కొంత మంది దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒకరిని చూసి, ఒకరు అన్నట్లు ఎవరికి నచ్చిన చోట, వారే దుకాణాలు ఏర్పాటుచేసుకుంటున్నారు. అధికారులు పట్టించుకోకపోతే, స్థానిక భైరిసాగరం చెరువు ఆక్రమణకు గురైన విధంగా జగనన్న కాలనీ సమీపంలోని స్థలమంతా ఆక్రమణకు గురయ్యే ప్రమాదం ఉందని పలువురు చర్చించుకుంటున్నారు.

అద్దెలకు దుకాణాలు ఇస్తూ సంపాదన

మక్కువ, చెముడు రహదారి పక్కన కొంతమంది పేదప్రజలు దుకాణాలు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తుంటే, మరి కొంతమంది వ్యక్తులు, జాగాలు కబ్జాచేసి, దుకాణాలు నిర్మించి, అద్దెలకు అప్పగిస్తున్నారు. అంతేకాకుండా క్రయ, విక్రయాల దందా కూడా గుట్టుచప్పుడు లేకుండా సాగిపోతోంది. ప్రభుత్వస్థలాల్లో ఇంత జరుగుతున్నా, పట్టించుకునే నాథుడు కరవవుతున్నాడని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ స్థలాల్లో దుకాణాలు ఏర్పాటుచేసుకుని, దర్జాగా విద్యుత్ కనెక్షన్లు పొంది వ్యాపారాలు సాగించుకుం టున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

రాకపోకలకు వేచిచూడాల్సిందే

మక్కువ, చెముడు గ్రామాల మధ్య రహదారికి ఇరువైపులా దుకాణాలు నిర్మించుకుని, వ్యాపారాలు సాగిస్తున్న కొంతమంది వ్యక్తులు, అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డులు సైతం రోడ్డుపై పెడుతున్నారు. వాహనాల రద్దీ ఓవైపు, ఇరుకు రోడ్డులో బోర్డులు, ఆటోలు, సైకిళ్లు ఇతరత్రా వ్యాపారాలకు అవసరమైన వస్తువలన్నీ రోడ్డుపైనే ఉంటున్నాయి. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా వాహనాల రద్దీతో రాకపోకలు సాగించే క్రమంలో పలువురు వాహనదారులు గాయాలపాలవుతున్నారు.

దుకాణదారులకు నోటీసులిస్తాం

దుకాణాలు విచ్చలవిడిగా నిర్మించడంతో, వారందరికీ భూఆక్రమణ చట్టం 1905 ప్రకారం నోటీసు లిస్తాం. నెలరోజుల్లోపు ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. భైరిసాగరం చెరువు పరిధిలో నిర్మించిన దుకాణాలు, జగనన్న కాలనీ సమీపంలో నిర్మించిన దుకాణాలను తహసీల్దార్ కె.భరత్‌కుమార్ శనివారం పరిశీలించారు.



భైరిసాగరం స్థలంలో ఏర్పాటుచేసిన దుకాణాలను పరిశీలించిన తహసీల్దార్ భరత్‌కుమార్

ఇది భైరిసాగరం చెరువు దీనస్థితి

మక్కువ ప్రధాన రహదారిని ఆనుకుని భైరిసాగరం చెరువు ఉంది. రహదారికి ఓవైపు జిల్లాపరిషత్ పాఠశాల ప్రహరీ ఉండగా, మరో వైపు చెరువు ఉంది. సర్వే నంబర్ 233లో సుమారు 19ఎకరాల వరకు చెరువు విస్తీర్ణం ఉండేది. కాలక్రమేణా అక్రమార్కుల దాష్టీకంతో చెరువు విస్తీర్ణం సుమారు 10ఎకరాలకు చేరిందంటే ఏమేరకు ఆక్రమణలు జరుగుతున్నాయో అర్థమవుతుంది.

మెట్టవలస గ్రామం సందర్శన

- రక్షిత మంచినీటి పథకం పునరుద్ధరణకు చర్యలు
- ట్యాంకర్లతో మంచినీరు సరఫరా



ట్యాంకర్ల ద్వారా మెట్టవలస గ్రామస్తులకు అందిస్తున్న మంచినీరు

సాక్షి ఎఫెక్ట్...

పాచిపెంట: మండలంలోని పెద్దవలస పంచాయతీ మెట్టవలస గ్రామానికి చెందిన గిరిజన ప్రజలు గత నెల రోజులుగా మంచినీటికి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో 'మెట్టవలసలో మంచినీటి కష్టాలు' శీర్షికన శనివారం సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆ గ్రామాన్ని సందర్శించి రక్షిత మంచినీటి పథకాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టారు, రక్షిత మంచినీటి పథకం ద్వారా నీరు సరఫరా చేసేందుకు రెండు రోజులు పడుతుందని, అంతవరకు మండల కేంద్రంలో ఉన్న 'పైలెట్ వాటర్ ప్రాజెక్ట్' నుంచి ట్యాంకర్ల ద్వారా మంచినీరు అందించనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బి.రామాంజనేయులు తెలిపారు. అందులో భాగంగా శనివారం సాయంత్రం మెట్టవలస గ్రామస్తులకు ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేశారు.

పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీవాణి

బలిజిపేట: పంచాయతీల అభివృద్ధికి అందరం పాటుపడాలని ఎంపీడీఓ శ్రీవాణి కోరారు. ఈ మేరకు ఎంపీపీ నాగమణి అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ పురోగతి సూచిక వి2.0 పై సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల అభివృద్ధికి సంబంధించి 9అంశాలపై ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. వాటిలో ముందుగా దేనికి ప్రాధాన్యం ఇవ్వాలనేది గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో వాటిని నిర్వహించాలని సూచించారు. పంచాయతీల్లో నిర్వహించే పనులపై అంశాల వారీగా వివరించారు. వాటిని తప్పనిసరిగా అమలు చేసి పంచాయతీల అభివృద్ధికి నాయకులు, అధికారులు, సిబ్బంది కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవికుమార్, మండలస్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ యోధుడికి ఘనంగా నివాళి

- సుధాకర్ ప్రసాద్ సేవలు చిరస్మరణీయం
- డీఆర్‌ఓ కె.హేమలత



ఏపీఆర్ఎస్ఏ ప్రచురించిన సుధాకర్ ప్రసాద్ జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించిన అధికారులు

పార్వతీపురం రూరల్: ఉద్యోగుల హక్కుల కోసం జీవించి, వారి సంక్షేమం కోసమే తుది శ్వాస విడిచేంత వరకు పోరాడిన యోధుడు, విప్లవ వీరుడు కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ అని డీఆర్‌ఓ కె.హేమలత కొనియాడారు. ఈ మేరకు సుధాకర్ ప్రసాద్ 24వ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సేవల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓతో పాటు ముఖ్య అతిథులుగా హాజరైన ప్రత్యేక ఉప కలెక్టర్లు పి.ధర్మచంద్రారెడ్డి, ఎస్. దిలీప్ చక్రవర్తిలు మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలకు సుధాకర్ ప్రసాద్ చేసిన సేవలు, ఆయన పోరాట స్ఫూర్తి ఎప్పటికీ ఆదర్శనీయమన్నారు. అనంతరం ఏపీ ఆర్ఎస్ఏ రాష్ట్ర కార్యవర్గం ప్రచురించిన ఆయన జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎదుగుదల సమస్యలు సకాలంలో గుర్తించాలి

- ఆర్‌బీఎస్‌కే అధికారి డా.టి.జగన్‌మోహన్‌రావు



అంగన్వాడీ కేంద్రంలో పిల్లల ఎత్తు, బరువులను పరిశీలిస్తున్న జిల్లా ఆర్‌బీఎస్‌కే అధికారి డా.టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురం రూరల్: చిన్నారుల ఆరోగ్య, ఎదుగుదల సమస్యలను సకాలంలో గుర్తించి వారికి మెరుగైన చికిత్స అందించాలని జిల్లా ఆర్‌బీఎస్‌కే అధికారి డా.టి.జగన్‌మోహన్‌రావు స్పష్టం చేశారు. ఈ మేరకు శనివారం ఆయన పార్వతీపురం మండలంలోని గంగాపురం, కోరె, ఎమ్మార్‌నగరం గ్రామాల్లో గల అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల హెల్త్ స్క్రీనింగ్, ఆన్‌లైన్ నమోదు, బరువు-ఎత్తుల రికార్డులను పరిశీలించారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వారి తల్లిదండ్రులకు ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని స్థానిక వైద్యసిబ్బందిని ఆదేశించారు. ఎదుగుదలలో ఆలస్యం, వైకల్యాలు, వ్యాధులు పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించి తక్షణమే జిల్లా కేంద్రంలో ఉన్న బాలల సత్వర చికిత్స కేంద్రానికి తరలించాలని సూచించారు. ఈ మేరకు వైద్య, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

29న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పాచిపెంట: ఈనెల 29వ తేదీన ఎంపీపీ బి.ప్రమీల అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీవీజే పాత్రో శనివారం తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు సంక్షిప్త సమాచారంతో హాజరుకావాలని కోరారు.

ప్రజాసమస్యలు పరిష్కారమయ్యేంతవరకు పోరాటం



సమావేశంలో సీపీఎం నాయికులు

మక్కువ: ప్రజా సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు, సీపీఎం పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. ఈ మేరకు స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో శనివారం సీపీఎం జనరల్‌బాడీ సమావేశాన్ని పార్టీ మండల నాయకుడు తాడంగి ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గంగునాయుడు మాట్లాడుతూ మండలంలో అనేక సమస్యలు ఉన్నాయని, గిరిజనపేదల ఆధీనంలో ఉండే, పట్టాభూములను పలువురు పెత్తందారులు ఆక్రమించుకున్నారన్నారు. అనేక ఏళ్లుగా సాగుచేసుకుంటున్న డీపట్టా భూములు, పోడు భూములకు పట్టాలివ్వలేదన్నారు. వెంగళరాయసాగర్ ప్రాజెక్ట్ పరిదిలో శివారు భూములకు సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. సురాపాడు ప్రాజెక్ట్ పరిధిలో అడారుగెడ్డ వద్ద మినీ రిజర్వాయర్ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్.వై నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లస్థలాల దరఖాస్తులపై సబ్‌కలెక్టర్ ఆరా



ఆర్జీదారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ వైశాలి

మక్కువ: మండలంలోని శంబర గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు ఇళ్ల స్థలాల మంజూరుకోసం ఇటీవల ఆర్జీలు పెట్టుకున్నారు. ఈమేరకు పార్వతీపురం మన్యం జిల్లా సబ్‌కలెక్టర్ వైశాలి, దరఖాస్తులను పునఃపరిశీలించేందుకు శనివారం శంబర గ్రామానికి చేరుకుని, ఆర్జీదారుల వివరాలను తహసీల్ద్రార్ భరత్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆర్జీదారులతో ఆమె మాట్లాడారు.

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న గిరిజనసంఘం నాయకులు

పార్వతీపురం: ఐటీడీఏ పరిధిలోని వైటీసీలో గల గర్భిణుల వసతి గృహంలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని గిరిజన సంఘం నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు శనివారం వారు ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురం, సాలూరు వైటీసీలలో గత ఏడేళ్ల నుంచి గర్భిణుల కోసం సిబ్బంది పనిచేస్తుండగా వారికి ఆరకొరగా జీతాలు ఇచ్చి పని చేయించుకుని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తొలగించారన్నారు. కరోనా సమయంలో కూడా ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పనిచేశారన్నారు. గతంలో ఉన్న పీఓలు గర్భిణులకు అవసరమైన సేవలను అందించాలన్న సంకల్పంతో నేషనల్ హెల్త్ మిషన్ పర్యవేక్షణలో సిబ్బందిని నియమించగా ఎన్నో ఏళ్లుగా సేవలందిస్తున్న సిబ్బందిని అకారణంగా తొలగించిన కారణంగా వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఐటీడీఏ పీఓ దృష్టిసారించి వారికి ఉద్యోగ భద్రత కల్పించి, పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ఇంటికుప్పల రామకృష్ణా రావు, టీఆర్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖరరావు, నాయకులు పల్ల సురేష్, దుక్క సీతారాం, ఆర్.లోవరాజు, పాలక రంజిత్‌కుమార్, బీవీ.రమణ, గర్భిణుల వసతిగృహం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

104 జిల్లా మేనేజర్ ఆకస్మిక తనిఖీ



104వాహనంలో రికార్డులను పరిశీలిస్తున్న 104 జిల్లామేనేజర్ ఎస్.కృష్ణ

సీతానగరం: 104 వాహనం వైద్యసేవలు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని 104 జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన వెంకటాపురం(కామందొరవలస) గ్రామంలో జరుగుతున్న 104 వైద్య శిబిరాన్ని ఆకస్మాత్తుగా తనిఖీ చేసి అక్కడి ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. పలు వివరాలను అడిగి వాహనంలో అన్ని రికార్డులు మందుల లభ్యతను పరిశీలించారు. వాహనాన్ని తనిఖీచేసి, పరిస్థితిని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు ఇంకా మెరుగైన వైద్య సేవలందించాలని ఎటువంటి మందులకొరత లేకుండా చూసుకోవాలని, అలాగే వాహనం కండిషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి ఏదైనా మేజర్ ప్రాబ్లమ్స్ ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని, తీసుకుని వస్తే, వెంటనే అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేస్తానని స్పష్టం చేశారు. సిబ్బంది పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, 104 సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పనులు చేపట్టకపోతే ఆందోళన



మక్కువ ప్రధానరహదారి వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

మక్కువ: మండలకేంద్రం మక్కువ నుంచి, సాలూరు వరకు రహదారి పనులు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వ్యవసాయ కార్మికసంఘం, సీఐటీయూ జిల్లా నాయకులు గంగునాయుడు, ఎన్.వై నాయుడు అన్నారు. ఈ మేరకు స్థానిక ప్రధానరహదారి వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి బాగులేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా, అధికారులు, పాలకులు పట్టించుకోవడంలేదన్నారు. రహదారి పొడవునా, గుంతలు ఏర్పడడంతో ద్విచక్రవాహనం వెళ్లేందుకు కూడా అవకాశంలేకుండా పోయిందన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దుగ్గేరు, సిరివర రోడ్డు పూర్తిచేయడంతో పాటు, మన్యం జిల్లాలో అన్ని రోడ్లు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి, ఏడాదిన్నర కావస్తున్నా రోడ్లు పూర్తిచేయలేదన్నారు. మంత్రి సంధ్యారాణి ప్రత్యేకశ్రద్ధ తీసుకుని, రహదారి పనులు జరిపించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ భరత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

దర్యాప్తు నివేదిక విడుదల చేయాలి

- ఏపీ రైతు సంఘం డిమాండ్



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రంలో పట్టణ ప్రజలకు ప్రాణాధారమైన దేవునిబంద, కామయ్య బంద, వరహాలగెడ్డ, నెల్లిచెరువులు కబ్జాకు గురయ్యాయని ఇటీవల ప్రభుత్వం వాటిపై చేపట్టిన దర్యాప్తు నివేదికను వెంటనే విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం అధ్యక్ష, జిల్లా కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, లక్ష్మునాయుడులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత మే 21న అప్పటి కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదన్నారు. డీఆర్‌ఓ కె.హేమలత సమక్షంలో జరిగిన దర్యాప్తులో 24మంది కబ్జాదారులకు నోటీసులు జారీ చేశామని ప్రభుత్వం లేఖ ఇచ్చింది కానీ ఆ తరువాత నివేదికలో ఎలాంటి చర్యలు లేకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. కబ్జాదారులు అధికార రాజకీయ అండతో స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు చిత్తశుద్ధితో ముందుకు వచ్చి కబ్జాలకు గురైన చెరువులను ప్రజా ప్రయోజనాలకు ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మినీ గోకులాల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను తక్షణం విడుదల చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. కార్యక్రమంలో బడే తిరుపతిరావు, నాగభూషణరావు, బంటు దాసు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల నిర్మాణంపై చిన్నచూపు

సాలూరు రూరల్:

గత ప్రభుత్వంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణాలు చేపట్టిన గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తెచ్చి ఇంటింటికీ ప్రభుత్వ సేవలు అందించే విధానానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది. గతంలో నిర్మాణ దశలో ఉన్న సచివాలయాల పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. మండలంలోని నార్లవలస పంచాయతీలో సచివాలయం శ్లాబ్ స్థాయి వరకు నిర్మాణం జరిగి ఉంది. అలాగే రైతుభరోసా కేంద్రం కూడా నిర్మాణ దశలోనే పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నప్పటికీ ఈ భవనాల నిర్మాణం పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్థాయిలో సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వంలో మిగిలిపోయిన పనులు పూర్తిచేయాల్సి ఉండగా ఆ పనుల విషయంలో నిర్లక్ష్యం చూపడం విచారకరమని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సచివాలయ వ్యవస్థను బలోపేతం చేసి గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు సక్రమంగా అందేవిధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



నార్లవలసలో శ్లాబ్ స్థాయిలో నిలిచిపోయిన పనులు



నిర్మాణానికి నోచుకోని రైతుభరోసా కేంద్రం